క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీల్లో కార్తీక్ ప్రతిభ



ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి దేవర కార్తీక్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. మే 18 నుంచి 20 వరకు మంచిర్యాల జిల్లాలో జరిగిన 11వ రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో హనుమకొండ జిల్లా జట్టుకు కార్తీక్ కెప్టెన్‌గా సారథ్యం వహించి జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో మూడో స్థానం పొందేలా కృషి చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ బాధ్యులతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

‘బోగస్ మాటలకే ఉత్తమ్ పరిమితం’

ఖానాపురం : క్షేత్రస్థాయి పర్యటనలు చేయకుండా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బోగస్ మాటలకే పరిమితం అయ్యాడని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధాన్యం కొనుగోలులో చిత్తశుద్ధి లేదన్నారు. ఎమ్మెల్యేలు, జిల్లాస్థాయి అధికారులు కనీసం క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. కొందరు కాంగ్రెస్ నాయకులు మిల్లర్లతో సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కార్యకర్తలకు కొనుగోలు కేంద్రాలు ఎలా ఇచ్చారో కలెక్టర్, అదనపు కలెక్టర్, డీసీఓ, డీఎస్‌ఓ, డీఎం సమాధానం చెప్పాలన్నారు. సహకార సంఘాలకు, ఎఫ్‌పీఓలకు చెందాల్సిన కొనుగోలు కేంద్రాల కమీషన్ కాంగ్రెస్ నాయకుల ఖాతాల్లోకి వెళ్లే పరిస్థితి నెలకొందని చెప్పారు. ఎమ్మెల్యే పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. సన్నాలకు బోనస్ అందలేదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు వేజెళ్ల కిషన్‌రావు, బండారపు శ్రీనివాస్, నాగార్జున్‌రెడ్డి, బోడ పూలు, మస్తాన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి’

నర్సంపేట : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ఎలకంటి రాజేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అక్కపెల్లి రమేశ్, తెలంగాణ ప్రజాఫ్రంట్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి, సీపీఎం నాయకుడు బాలకృష్ణ, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు మల్లేశం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ఆ పార్టీల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజేందర్, రమేశ్, కుమారస్వామి, బాలకృష్ణ, మల్లేశం మాట్లాడారు. మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి కేశవరావు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం వెళ్లగా పట్టుకొని ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేశారని ఆరోపించారు. మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, పౌరహక్కుల సంఘాలు, వివిధ రాష్ట్రాల సీఎంలు కోరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నరమేధం కొనసాగిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల తిరుపతి, కృష్ణ, గొర్రె ప్రదీప్, పూలక్క, అశోక్, వీరస్వామి, మ ల్లయ్య, గుంపెల్లి మునీశ్వర్, పాలక కవిత, నాగరాజు, కందికొండ కుమార్, సాంబెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ చేపట్టాలి

వర్ధన్నపేట : ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తుల చేత విచారణ చేపించాలని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌ఎస్‌పీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాసు కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టు నేతలను అరెస్టు చేయకుండా ఎదురుకాల్పుల పేరుతో చంపివేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తెలిపారు. ఇకనైనా ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు.

మిల్లులకు ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం

సంగెం : కాంటా అయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ ఆరోపించారు. మండలంలోని కాపులకనిపర్తి సొసైటీలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, మిల్లర్లు తాలు, తరుగు పేరుతో క్వింటాకు 5 కిలోల కటింగ్ చేస్తున్నారని ఆరోపించారు.

అడుగడుగునా గుంతలు..!



రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత



ఇరుకుగా ఉన్న రోడ్డు, గుంతల కారణంగా ప్రమాదకరంగా వెళ్తున్న కార్లు

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- చినుకుపడితే గుంతల నిండా నీళ్లు
- పాలకులపై ఆగ్రహిస్తున్న వాహనదారులు

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల గ్రామం నుంచి క్యాతంపల్లికి వెళ్లే రోడ్డు మొత్తం పెద్ద గుంతలు, గోతలతో దర్శనమిస్తుంది. కరుణాపురం జాతీయ రహదారి నుంచి క్యాతంపల్లికి 7 కిలోమీటర్లు, పెద్దపెండ్యాల నుంచి క్యాతంపల్లికి 4 కిలోమీటర్లు ఉంటుంది. వేలేరు మండలం మల్లికుదుర్ల, జానికిపురం, క్యాతంపల్లి గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తుంటారు. హైదరాబాద్‌కు వెళ్లే ఆయా గ్రామాల ప్రజలు కరుణాపురం చేరుకుని జాతీయ రహదారి మీదుగా వెళ్తుంటారు. అదే విధంగా హనుమకొండ, కాజీపేట నగరాలకు కూడా ప్రజలు ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారు. గతంలో జనగాం డిపో నుంచి ఆర్టీసీ బస్సు కరుణాపురం, పెద్దపెండ్యాల, క్యాతంపల్లి, మల్లికుదుర్ల, వేలేరు మీదుగా వేములవాడకు వెళ్తుండేది. ఈ క్రమంలో పెద్దపెండ్యాల నుంచి క్యాతంపల్లి గ్రామం వరకు రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో ఆ బస్సును రద్దు చేశారు. అదే విధంగా గుర్రాలకుంట ప్రజలు, రైతులు వివిధ పనుల కోసం క్యాతంపల్లికి, వ్యవసాయ పనుల నిమిత్తం బావుల వద్దకు ఈ రోడ్డు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. పెద్దపెండ్యాల గ్రామ శివారులోని చర్చి నుంచి క్యాతంపల్లి వరకు రోడ్డంతా గుంతలు ఏర్పడడంతో ఎదురుగా ఏదైనా వాహనం వచ్చినా మరో వాహనం ఆపుదల చేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. దానికి తోడు క్యాతంపల్లి సమీపంలో మూల మలుపున రోడ్డుకు ఓ పక్కన కోత పడి, పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ఏ మాత్రం అదుపుతప్పినా పెద్ద ప్రమాదమే జరుగుతుంది. ఈ క్రమంలో ప్రయాణికులు ఆ రోడ్డు గుండా ప్రాణాలు అరచేతులో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఆ రోడ్డుకిరువైపులా ఆయా గ్రామాల రైతుల వ్యవసాయ భూములు ఉంటాయి. రైతులు నిత్యం ఆ రోడ్డు గుండా ప్రయాణిస్తుంటారు. ఇటీవల రైతులు వ్యవసాయ పరికరాలు, ఎరువుల బస్తాలు తీసుకెళ్తూ ప్రమాదానికి గురైన సంఘటనలు చోటుచేసుకున్నాయని, పాలకులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఉంది

పెద్దపెండ్యాల, క్యాతంపల్లి గ్రామాల మధ్యలో రోడ్డు మొత్తం గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. కొన్ని సంవత్సరాల క్రితం ఈ రెండు గ్రామాల ప్రజల, రైతుల సౌకర్యార్థం బీటీ రోడ్డు నిర్మించారు. అయితే నాటి నుంచి ఈ రోడ్డును పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. రాబోవు వర్షకాలంలో చిన్నపాటి వర్షం పడినా రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీళ్లు నిండి ప్రయాణించలేని స్థితిలోకి మారుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

- పల్లెర్ల శ్రీనివాస్‌రెడ్డి, స్థానికుడు

సంక్షిప్తంగా

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఎన్నిక



కమలాపూర్ : ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా కంభంపాటి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తోట సురేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో గురువారం జరిగిన ఆర్య వైశ్య మహాసభ సర్వసభ్య సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చకిలం రాజేశ్వర్‌రావు, పబ్బతి నాగభూషణం, కొనిశెట్టి మునీందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శిగా వెనిశెట్టి శివకుమార్, ఉపాధ్యక్షులుగా చకిలం దయాకర్, అయిత మధుకర్, వెనిశెట్టి కాంతినాథ్, యాంసాని శ్రీనివాస్, కోశాధికారిగా వెనిశెట్టి పున్నంచందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా దొడ్డ రమేశ్, కొనిశెట్టి సురేశ్, కల్లూరి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ మోహన్‌రావు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వెనిశెట్టి రఘు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు తాటిపెల్లి రాజన్న, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు అడ్డగుడి సతీశ్‌కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు పడకంటి జ్యోతి, మహిళా ప్రధాన కార్యదర్శి దొడ్డ దేవి, కోశాధికారి అయిత పద్మజ, నాయకులు నూక సంపత్‌కుమార్, సాంబమూర్తి, వీరభద్రయ్య, అయిత వెంకటేశ్వర్లు, వెనిశెట్టి కిశోర్, దొంతుల నాగేశ్వర్‌రావు, నంగునూరి సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

‘ఈటల’కు నాయకుల స్వాగతం



శాయంపేట / పరకాల : కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు వెళ్తున్న ఎంపీ ఈటల రాజేందర్‌ను శాయంపేట మండలంలోని మాందారిపేట స్టేజీ వద్ద, బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొగిలి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికిరణ్, నాయకులు రాజు, నాగరాజు, శివ, రమణారెడ్డి, స్వరూప, సత్యనారాయణ, విజయ్, తిరుపతి, సుమన్, రాజశేఖర్, నవీన్, రాజేశ్, పైడి, రామకృష్ణ, మహేష్, మహేందర్, రమేశ్, రాజుకుమార్, మధు, దినేష్, వెంకటేశ్, రాంప్రసాద్ పాల్గొన్నారు. అలాగే పరకాల పట్టణంలో నియోజవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగడాల కాళీప్రసాద్, పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, రూరల్ అధ్యక్షుడు కాసగాని రాజ్‌కుమార్, నడికూడ మండల అధ్యక్షుడు ఎరుకల దివాకర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి ఈటెలను కలిసి స్వాగతం పలికారు.

మాజీ ఎమ్మెల్యే ఔదార్యం



దామెర : మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఔదార్యాన్ని చాటుకున్నారు. గురువారం ఆయన మండలంలోని ల్యాదెళ్లకు వెళ్తున్న క్రమంలో ఆటో బోల్తా పడింది. దీంతో అటుగా వెళ్తున్న ధర్మారెడ్డి తన కారును ఆపి క్షతగాత్రుల వివరాలు తెలుసుకుని తన కారులో ఆసుపత్రికి తరలించారు. దీంతో బాధితుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామ మాజీ సర్పంచ్ పురం మల్లయ్య, ల్యాదెళ్లకు చెందిన రాయాకుల సతీశ్, మనుమకొండ మొగిలి ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, మాజీ ఎంపీపీ కాగితాల శంకర్, జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, సమన్వయ కమిటీ సభ్యులు మల్లయ్య, రమేశ్, సదానందం, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మరో రెండు రోజులపాటు వర్షాలు

హన్మకొండ : మరో రెండు రోజులపాటు వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. గురువారం సాయంత్రం హనుమకొండ జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 8 గంటల వరకు జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. జిల్లాలో అత్యధికంగా ఎల్కతుర్తిలో 32.8 మిల్లీ మీటర్లు, భీమదేవపల్లిలో 24.3, దామెరలో 22.8, కమలాపూర్‌లో 15, శాయంపేటలో 12, ఆత్మకూరులో 8.3, వేలేరులో 7.3, నడికుడలో 7.8, ధర్మసాగర్‌లో 3.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ చౌరస్తా: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. హనుమకొండ చౌరస్తాలోని ప్రధాన నాలాను గురువారం రాత్రి పరిశీలించారు. వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

పేదలను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

దామెర : పేదలను విస్మరించి ధనికుల పక్షపాతిగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నకిస్తే ఓదెలు ఆరోపించారు. మండల కేంద్రంలో జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షాన పోరాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలక భూమిక పోషించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలు పెంచుతూ నిరుపేదలను ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. ఈనెల 26, 27వ తేదీన హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పుట్టపాక రవి, సహాయ కార్యదర్శిగా చల్లా అశోక్, మేరుగు సారంగపాణి, కోశాధికారి మిరియాల రాజు, కార్యవర్గ సభ్యులుగా గోపు ఐలయ్య, బొజ్జల రాజు, సింగరా రాజేందర్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కు రాజు, బత్తిని రాజు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెల్లి రవి, సుప్రియ, వసంత, వేణు, గట్టయ్య, భూషణం పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

కమలాపూర్ : మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో హనుమాన్ మాలధారులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని విశ్వపతి ఆలయంతో పాటు పలు గ్రామాల్లో 41 రోజులు నియమ నిష్ఠలతో ఆంజనేయుడి దీక్షలో తరించిన మాలధారులు ఇరుముడులు కట్టుకుని శ్రీ సువర్చలా సహిత ఆంజనేయస్వామిని, రామాలయంలో శ్రీ సీతారాములను దర్శించుకుని మాలా విరమణ కోసం కొండగట్టు, భద్రాచలం, పొన్నూరు, ఇల్లంతకుంట తదితర పుణ్య క్షేత్రాలకు తరలివెళ్లారు. గ్రామాలన్నీ హనుమాన్, రామనామ స్మరణతో మార్మోగాయి.

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ఆలయాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి అంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. గుడెప్పాడ్ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ఆరుట్ల కేశవమూర్తి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మాలధారులు భక్తులు సంకీర్తనలు చేసి అంజనేయస్వామిని కొలిచారు. అనంతరం ఆలయాల్లో మాల విరమణ చేశారు.



ఆత్మకూరు : పూజలు చేస్తున్న భక్తులు

శాయంపేట : మండలంలో ఆంజనేయ స్వామి ఆలయాల్లో, మండల కేంద్రంలోని శ్రీమత్యాగిరి స్వామి ఆలయం, శివ మార్కండేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని పంచముఖ ఆంజనేయ ఆలయంలో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, మార్త రాజ్‌కుమార్ పంచామృత అభిషేకాలు నిర్వహించి చందనం వేశారు. శివ మార్కండేయ స్వామి ఆలయంలో హనుమాన్ కవచ స్తోత్ర పారాయణ సహిత హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



కమలాపూర్ : ఇరుముడులు ధరిస్తున్న హనుమాన్ మాలధారులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- సీఐ పులి రమేశ్

ఎల్కతుర్తి : ఫర్టిలైజర్ దుకాణాదారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ పులి రమేశ్ హెచ్చరించారు. మండలంలోని పలు ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ షాపులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని రికార్డులు, రసీదు బుక్కులను పరిశీలించారు. విత్తనాలు, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎవరైన నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలను రైతులకు అంటగట్టినట్లు తెలిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాల స్టాక్‌కు సంబంధించిన ధరల పట్టిక ప్రతీరోజు రైతులకు కనిపించే విధంగా విత్తనాల ధరలను ఎప్పటికప్పుడు ధరల పట్టికలో తెలియజేయాలన్నారు. రైతులు సైతం విత్తనాలు కొనుగోలు చేసిన రసీదులను జాగ్రత్తగా దాచుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్సై ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, ఏఈఓ పున్నంచందర్ పాల్గొన్నారు.



ఫర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు

సేంద్రియ ఎరువులను వినియోగించాలి



కమలాపూర్ : అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త



వేలేరు : మాట్లాడుతున్న పద్మజ

- శాస్త్రవేత్తలు డాక్టర్ దిలీప్‌కుమార్, విశ్వతేజ, పద్మజ

కమలాపూర్ : పంట సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వరంగల్ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ విశ్వతేజ సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని శనిగరం రైతు వేదికలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. తక్కువ యూరియా వాడకంతో ఖర్చు తగ్గించుకోవచ్చని, అవసరం మేరకు పురుగు మందులు వినియోగించి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనే సమయంలో రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకుని భద్రపర్చుకోవాలన్నారు. సాగు నీటిని వృథా చేయకుండా అవసరం మేరకే వినియోగించాలని, ప్రతిసారి ఒకే రకం పంటను సాగు చేయకుండా పంట మార్పిడి చేయాలన్నారు. ఏఓ రాజ్‌కుమార్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ప్రతాప్, జయప్రకాశ్, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ అన్నారు. గురువారం మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువులుగా జీలుగ, జనుము, పిల్లిపెసరు, అపరాల పంటలు వేయడం వలన నేల సారవంతమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ కవిత, ఏఈఓ శిల్పా, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నైపుణ్యం ప్రదర్శించాలి



పరకాల : మాట్లాడుతున్న ఆంజనేయులు



ఐనవోలు : మాట్లాడుతున్న రావుల భాస్కర్

- ఎంపీడీఓ ఆంజనేయులు

పరకాల : మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. మూడు రోజులుగా పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు నాణ్యమైన విద్యాను అందిస్తున్న విషయాన్ని ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పిల్లల తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించాలని అన్నారు. అదే విధంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, దుస్తులు అందిస్తున్న విషయాన్ని వివరించాలని అప్పుడే ప్రభుత్వ పాఠశాలకు పూర్వ వైభవం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ ఎస్.రమాదేవి, స్టేట్ రిసోర్స్ పర్సన్ శ్రీధర్, ఎం.ఆర్.పీలు భిక్షపతి, రామన్న, మోహన్, ఆజాం, బాబు, లత, కీరవాణి పాల్గొన్నారు.

ఐనవోలు : సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని సీనియర్ సిటిజన్ కమిటీ సమన్వయ కర్త రావుల భాస్కర్ అన్నారు. మండలంలోని పున్నేలు క్రాస్ వద్ద గల ఏకశిల స్కూల్‌లో రాయపర్తి మండల ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం కొనసాగింది. ముఖ్య అతిథిగా హాజరైన భాస్కర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి భిన్నమైందని, అన్ని వృత్తులను సమాజానికి పరిచయం చేసేది ఉపాధ్యాయ వృత్తి అన్నారు. ఉపాధ్యాయులు జీవన నైపుణ్యాల్లో శిక్షణ పొంది విద్యార్థులను కూడా తమ భవిష్యత్ జీవితంలో జీవనం సాగించడానికి ప్రత్యేక శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఎంఈఓ శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్‌లు, 120 మంది ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- ఎంపీడీఓ గుండె బాబు

కమలాపూర్ : మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించే బాధ్యత కూడా మనదేనని ఎంపీడీఓ గుండె బాబు అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేశ్‌తో కలిసి గురువారం ఆయన సుమారు 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ వరుణ్ కుమార్, డాక్టర్ విజేత, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ జ్యోతి, ఏపీఓ రమేశ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాలసాని రమేశ్‌గౌడ్, ఉపాధి హామీ, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న అధికారులు

సట్టా ఆడుతున్న ఒకరి అరెస్ట్

కమలాపూర్ : మండలంలోని కానిపర్తికి చెందిన ఆటో డ్రైవర్ జనగాని సురేశ్‌కుమార్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, కమలాపూర్ సీఐ హరికృష్ణ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కానిపర్తిలో ఆన్‌లైన్ సట్టా ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడులో ఆన్‌లైన్‌లో సట్టా ఆడుతున్న సురేశ్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.10,450 నగదుతో పాటు ఒక మైక్రోమ్యాక్స్ ఫోన్, గేమ్ స్లిప్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, ఎస్సై దిలీప్, టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

రామన్నపేట: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఏవీవీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొనిమాల శ్రీనివాసరావు సూచించారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.